సాక్షి
నల్లగొండ
గురువారం । 15 । ఫిబ్రవరి । 2024



జాతరలు వచ్చే.. సందడి తెచ్చే
మాఘ మాసం వచ్చిందంటే పెద్దఅడిశర్లపల్లి మండలంలోఆధ్యాత్మిక శోభ ఉట్టిపడుతుంది.
- 8లో



యాదాద్రిలో నూలుకు పూజలు
వసంత పంచమి సందర్భంగా బుధవారం యాదాద్రి ఆలయంలో పట్టు నూలుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.
- 10లో



జన్మభూమి రైలులో పొగలు
సికింద్రాబాద్ నుంచి విశాఖపట్టణం వెళ్తున్న జన్మభూమి రైలులో పొగలు రావడంతో మిర్యాలగూడలో నిలిపివేశారు.
- 10లో

న్యూస్‌రీల్

ప్రాక్టికల్స్‌కు 59 మంది గైర్హాజర్

నల్లగొండ : ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ప్రాక్టికల్స్‌కు బుధవారం 59 మంది గైర్హాజరయ్యారు. ఉదయం జరిగిన పరీక్షకు 1134 మందికి గాను 1095 మంది హాజరుకాగా 39 మంది గైర్హాజర్ అయ్యారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 722 మందికి గాను 702 మంది హాజరుకాగా 20 మంది గైర్హాజరయ్యారు.

బాధ్యతల స్వీకరణ



జెడ్పీ చైర్మన్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న అధికారులు

నల్లగొండ : బదిలీపై జిల్లాకు వచ్చిన జెడ్పీ డిప్యూటీ సీఈఓ బి.శ్రీనివాస్‌రావు, డీఆర్‌డీఓ నాగారెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం వారు జిల్లా పరిషత్ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యకమంలో జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి, జెడ్పీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కొప్పు రాంబాబు తదితరులు ఉన్నారు.


టీఎన్‌జీఓ జిల్లా కార్యవర్గం ఎన్నిక

నల్లగొండ టౌన్ : తెలంగాణ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం (టీఎన్‌జీఓ) జిల్లా నూతన కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నాగిళ్ల మురళి, కార్యదర్శిగా జే.శేఖర్‌రెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడిగా డీవీ రాజు, కోశాధికారిగా మేడి జయరావును ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా పాల్వాయి గామయ్య, డి.యాదయ్య, కొంగల దశరథ, తిరునగరి రమాదేవి, సహాయ కార్యదర్శులుగా ఈసం రమేష్, దీరావత్ సైదులునాయక్, మహ్మద్ అన్వర్, ఎస్.రమ్యసుధ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా వి.భాస్కర్, పబ్లిసిటీ సెక్రటరీగా ఏ.రామకృష్ణారెడ్డి, కార్యవర్గ సభ్యులుగా ఆర్.భిక్షం, బుర్రి కిరణ్‌కుమార్, జే.అనురాధ, సాబేరాసుల్తానాను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా పందిరి వెంకటేశ్వరమూర్తి, మామిడాల రమేష్ వ్యవహరించారు. నూతన కార్యవర్గాన్ని యూనియన్ నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎం.శ్రవణ్‌కుమార్, సిహెచ్ నర్సింహాచారి, వంగూరు విజయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవాలి

నల్లగొండ : జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు 2024–25 విద్యా సంవత్సరానికిగాను ఉపకార వేతనాలకు మార్చి 31వ తేదీలోగా రెన్యువల్, నూతన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి ఎల్.శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాల విద్యార్థులు https://telanganaepass cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 2019 నుంచి 2023 వరకు పెండింగ్ ఉపకార వేతనాల హార్డ్ కాపీలను ఈ నెల 20వ తేదీ లోగా పంపించాలని పేర్కొన్నారు.

వంద శాతం ఫలితాలు సాధించాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈఓ

నాంపల్లి : వంద శాతం ఫలితాలు సాధించేందుకు విద్యార్థులు కష్టపడి చదవాలని డీఈఓ బి.భిక్షపతి అన్నారు. బుధవారం నాంపల్లి కేజీబీవీని ఆయన సందర్శించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల బోధనా అభ్యాసన ప్రక్రియలు, పాఠశాలలో సదుపాయలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల విద్య, ఆరోగ్యం, రక్షణ విషయంలో సిబ్బంది పూర్తిస్థాయిలో బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేకాధికారిని డి.విజయశ్రీ, పీజీ సీఆర్‌టీలు మల్లేశ్వరి, రేవతమ్మ, మమత, సీఆర్‌టీలు శ్రీలత, లలితవాణి, జానీబేగం, రేవతి, క్రాఫ్ట్ టీచరు ఆరుద్ర తదితరులు ఉన్నారు.

జిల్లా ఏఎస్పీగా రాములునాయక్

నల్లగొండ క్రైం : జిల్లా నూతన అడిషనల్ ఎస్పీగా బీ.రాములునాయక్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సంగారెడ్డి నుంచి ఆయన బదిలీపై జిల్లాకు వచ్చారు. గతంలో జిల్లాలో వివిధ ప్రాంతాల్లో ఆయన విధులు నిర్వహించారు.

రాగాలు పలికే రాళ్లు..

- అయిటిపాములలోని నాగరగుట్ట రాళ్లలో సంగీత శబ్దాలు
- సందర్శకులను కట్టిపడేస్తున్న మ్యూజిక్ స్టోన్స్
- పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలంటున్న స్థానికులు

చూపునకు శిలలే.. ప్రాణంలేని రాళ్లే.. కానీ ఆ శిలల్లో కొన్ని అద్భుతం.. వాటిల్లో ఏ రాయిని రాపిడి చేసినా రాగాలు పలుకుతాయి. ఈ బండరాయిని మరో రాయితో కొట్టే ప్రతీ ఒక్కరూ సంగీత కళాకారుడిలా మురిసిపోతారు. సంగీతానికి రాళ్లయినా కరుగుతాయని పెద్దలు అంటారు. రాళ్లు కరుగుతాయో లేదో మనం చూడలేదు కానీ నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలం అయిటిపాములలోని చెరువుపక్కనున్న రాళ్లు వింత ధ్వనులతో మార్మోగుతున్నాయి. ఇవి చారిత్రక ఆనవాళ్లకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఈ వింతను భావితరాలకు అందించాల్సిన పురావస్తు శాఖ దీనిని పట్టించుకోవడం లేదు.

- సాక్షి ప్రతినిధి, నల్లగొండ

కట్టంగూరు మండలం అయిటిపాముల గ్రామంలో నాగరగుట్టపై అరుదైన మ్యూజికల్ స్టోన్స్ ఉన్నాయి. ఈ మిరాకిల్ రాక్స్ ప్రత్యేకతను కనులారా చూసి చెవులారా వింటేనే ఆ అద్భుతం అవగతమవుతుంది. వాటిని సింగింగ్ రాక్స్, మ్యూజికల్ రాక్స్ అంటుంటారు. చారిత్రక ఆనవాళ్లు కలిగిన ఈ రాళ్లు ఇప్పుడు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. సంగీతంలో సరిగమల్లా ఒక్కో చోట ఒక్కో శబ్దం వినిపిస్తుంది. గుడిలో, బడిలో గంట సౌండ్‌లా వినిపిస్తున్నాయి. ఈ వింతను చూసేందుకు నాగరగుట్టకు పర్యాటకులు క్యూ కడుతున్నారు. ఈ రాళ్లు పకృతి సిద్ధంగా ఏర్పడ్డాయా..? లేక పూర్వకాలంలో రాజులు ఏర్పాటు చేశారా..? అనేది మిస్టరీగా మారింది.



రాళ్లను కొడుతూ సంగీతం వింటున్న గ్రామస్తులు

రక్షణ కోసం వినియోగించేవారని ప్రతీతి

పూర్వం రాజులు ఈ గుట్టను గ్రామానికి రక్షణ కవచంగా, శత్రుమూకల రాకలను పసిగట్టేందుకు శబ్దం చేసేందుకు ఈ రాళ్లను వినియోగించుకునే వారని స్థానికులు చెప్పుకుంటారు. అప్పటి నుంచి ఈ కొండను నగారా అనే పేరుతో పిలువడం ఆనవాయితీ. గ్రామస్తులతో పాటు ఇతర గ్రామాల ప్రజలు సెలవుల సమయంలో ఇక్కడికి వచ్చి రాళ్లను మోగిస్తూ నాద స్వరాలను వింటూ ఆహ్లాదాన్ని పొందుతున్నారు. కొండపై ఎన్నో రాళ్లు ఉండగా అందులో మూడు రాళ్ల నుంచి మాత్రమే భిన్న స్వరాలు పలుకుతుండడం చూడటానికి ఆశ్చర్యం వేస్తుంది. ఒక పక్క పక్షుల కిలకిల రావాలు, మరో వైపు సంగీత స్వరాలు వినిపించే ఈ నగారా గుట్ట ప్రాంతం ప్రతి ఒక్కరినీ విశేషంగా ఆకట్టుకుంటోంది. ఇలాంటి రాళ్లను పురావస్తు శాఖ వెలుగులోకి తీసుకురావాలని స్థానికులు అభిప్రాయ పడుతున్నారు. ఈ రాళ్ల ప్రత్యేకతను గుర్తించి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



రాగాలు పలికే ప్రధాన రాయి

అనేక రాళ్లు ఉన్నా.. కొన్నే ప్రత్యేకం

కొండపై ఎన్నో రాళ్లు ఉన్నా.. కొన్ని రాళ్ల నుంచి మాత్రమే రకరకాల శబ్దాలు రావడం ప్రజల్ని ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఇది సంగీత ప్రియులకు ఎంతో సంతోషాన్ని కలిగిస్తోంది. చిన్న పిల్లలు, పెద్దలు తెగ ఎంజాయ్ చేస్తున్నారు. పూర్వీకుల కాలం నుంచి ఈ రాళ్ల ప్రాంతాన్ని నగారా గుట్టగా పిలుస్తారు. ఇక్కడ ఉన్న మూడు రాళ్లల్లో విభిన్న స్వరాలు వినబడుతాయి. ఇక్కడ ఒక రాయిని కొడితే కంచు, మరో రాయిని కొడితే ఐరన్ శబ్దం, ఇంకో రాయిని కొడితే గుడి గంట కొట్టిన శబ్దాలు వినబడుతాయి.

పర్యాటక కేంద్రంగా గుర్తించాలి



అయిటిపాముల గ్రామంలో జాతీయ రహదారికి సమీపంలో ఉన్న నగారా గుట్ట రాళ్లలో భిన్నశబ్దాలు రావడం ఇక్కడి ప్రత్యేకత. గుట్టలోని మూడు తెల్ల రాళ్ల నుంచి మాత్రమే అద్భుతమైన విభిన్న శబ్దాలు వస్తాయి. కొండ పక్కనే చెరువు ఉండటంతో ప్రతి సంవత్సరం సైబేరియన్ కొంగలు, పక్షులు ఇక్కడికి వస్తాయి. ప్రజలు నిత్యం గుట్ట వద్దకు వచ్చి రాళ్ల సంగీతం విని ఆనందించి వెళుతుంటారు. ప్రభుత్వం ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా గుర్తించి అభివృద్ధి చేయాలి.

- ఇటికాల సురేందర్, అయిటిపాముల

రాళ్లు స్వరాలు పలుకుతాయి



నగారా గుట్టపై ఉన్న రాళ్లల్లో సంగీతంలో సరిగమల్లా ఒక్కో చోట ఒక్కో శబ్దం వినబడుతుంది. ఇక్కడ స్టోన్స్ పలికే సౌండ్స్ కిలోమీటరు దూరం వరకు వినిపిస్తాయి. ఏనెపై ఎన్నో రాళ్లు ఉండగా అందులో మూడు రాళ్ల నుంచి విభిన్నమైన శబ్దాలు వస్తుండటంతో వినడానికి వినసొంపుగా ఉంటుంది. గ్రామస్తులు నిత్యం ఇక్కడికి వచ్చి శబ్దాలు చేసి ఆనందించి వెళుతుంటారు.

- అనంతుల శంకరయ్య అయిటిపాముల

పురావస్తు శాఖ గుర్తించాలి



సంగీత స్వరాలు వినిపించే ఈ నగారా గుట్టను పురావస్తు శాఖ అధికారులు పరిశీలించి గుర్తింపు తేవాలి. ఈ గుట్ట సమీపంలో ఉన్న మరో రెండు గుట్టల వద్ద ఉన్న రాళ్లలో భిన్న స్వరాలు వస్తున్నాయి. పచ్చని పంట పొలాల మధ్య నల్లని కొండ చూడ ముచ్చటగా ఉన్న ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలి. తాతల కాలం నుంచి కాపాడుకున్న సంపదగా మా గ్రామస్తులు భావిస్తున్నారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలతో పాటు ఇతర ప్రాంత ప్రజలు నగారా గుట్టకు వచ్చి ఆహ్లాదాన్ని పొందుతున్నారు.

- కొండ్ర చిన నర్సింహ, అయిటిపాముల

టాలెంట్ టెస్ట్‌ను సద్వినియోగం చేసుకోవాలి



కరపత్రాలను విడుదల చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నల్లగొండ టౌన్ : ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 18న నిర్వహించే టాలెంట్ టెస్ట్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర గర్ల్స్ కోకన్వీనర్ కుంచం కావ్య పిలుపునిచ్చారు. బుధవారం స్థానికంగా టాలెంట్ టెస్ట్ కరపత్రాలను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదో తరగతి జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ కనబర్చిన వారికి మంచి బహుమతులు ఇస్తామన్నారు. వివకాల కోసం ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో లేదా 9010083200, 9652074486 ఫోన్ నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మానస, పూజ, మమత, అనూష, లావణ్య, విఘ్నేశ్వరి, కల్పన, రాధిక, అంజలి, స్వాతి పాల్గొన్నారు.

పలువురు డీఎస్పీల బదిలీ

నల్లగొండ క్రైం : ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పలువురు డీఎస్పీలను బదిలీ చేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. మిర్యాలగూడ డీఎస్పీ వెంకటగిరి హైదరాబాద్ సీసీఎస్ ఏసీపీగా, సూర్యాపేట డీఎస్పీ నాగభూషణంను డీజీపీ ఆఫీస్‌కు అటాచ్ చేశారు. అక్కడ డీసీఆర్‌బీలో ఉన్న డీఎస్పీ రవికి సూర్యాపేట డీఎస్పీగా పోస్టింగ్ ఇచ్చారు. నిజామాబాద్ టాస్క్‌ఫోర్స్ ఏసీపీగా ఉన్న రాజశేఖర్‌రాజుకు మిర్యాలగూడ డీఎస్పీగా పోస్టింగ్ ఇచ్చారు.

ఉమ్మడి జిల్లా హ్యాండ్ బాల్ జట్లు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులు

నకిరేకల్ : ఉమ్మడి నల్లగొండ జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నకిరేకల్ మండలం మంగళపల్లి జెడ్పీ హైస్కూల్‌లో బుధవారం సీనియర్ పురుషుల, మహిళల హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక పోటీలను నిర్వహించారు. ఉమ్మడి జిల్లా నుంచి 80 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఈనెల 17 నుంచి 19 వరకు కరీంనగర్‌లో జరిగే 52వ సీనియర్ పురుషులు, మహిళల హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొననున్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కర్ర వీరారెడ్డి, హ్యాండ్ బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకాయల పుల్లయ్య, ఎండీ.ఉస్మాన్, సత్యనారాయణ, అనిల్ రెడ్డి, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

• చిన్నారులకు అక్షరాభ్యాసం



వసంత పంచమి సందర్భంగా బుధవారం మిర్యాలగూడ మండలం అవంతీపురం సరస్వతీ దేవి ఆలయంలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న తల్లిదండ్రులు - మిర్యాలగూడ

మార్చి 14 వరకు ఓటరు నమోదు



కలెక్టర్ హరిచందన

నల్లగొండ : వరంగల్– ఖమ్మం –నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గంలో ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఆసక్తి ఉన్నవారు మార్చి 14వ తేదీ వరకు ఫారం– 18 దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ హరిచందన బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఫిబ్రవరి 6, 2024వ తేదీని చివరి గడువుగా నిర్ణయించినప్పటికీ.. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ నిరంతరం కొనసాగుతోందని తెలిపారు. నవంబర్ 1, 2023వ తేదీలోగా గ్రాడ్యుయేట్ పూర్తయిన వారు ఓటరునమోదుకు అర్హులని తెలిపారు. మార్చి 14వ తేదీ వరకు వచ్చిన దరఖాస్తులన్నింటినీ పరిష్కరించి.. ఓటరు తుది జాబితాను ఏప్రిల్ 4న ప్రచురిస్తామని వెల్లడించారు.

కేసీఆర్ అబద్ధాలు చెప్పారు

- సీపీఐ జాతీయ కమిటీ సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న పల్లా వెంకట్‌రెడ్డి

నల్లగొండ టౌన్ : జిల్లాలోని ఏ ఒక్క ప్రాజెక్టును కూడా పూర్తి చేయకుండా జిల్లా కేంద్రంలో మంగళవారం జరిగిన బహిరంగ సభలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వచ్చి అబద్ధాలు చెప్పారని సీపీఐ జాతీయ కమిటీ సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి విమర్శించారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సీపీఐ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ పది సంవత్సరాలు సీఎంగా ఉండి జిల్లాకు తీవ్ర అన్యాయం చేశారన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ఎస్ఎల్‌బీసీని ఒక్క కిలోమీటర్ కూడా పూర్తి చేయలేదన్నారు. 2015లో శంకుస్థాపన చేసిన చర్లగూడెం రిజర్వాయర్ భూనిర్వాసితులకు పూర్తిగా నష్ట పరిహారం చెల్లించలేదన్నారు. డిండి ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు ఇవ్వకుండా దేవరకొండ నియోజకవర్గానికి తీవ్ర అన్యాయం చేశారన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రైతాంగ, కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఈ నెల 16న జరిగే దేశవ్యాప్త సమ్మెకు సీపీఐ సంపూర్ణ మద్దతు ఇస్తోందన్నారు. సమావేశంలో నాయకులు పల్లా నర్సింహారెడ్డి, ఉజ్జిని యాదగిరిరావు, పి.దేవేందర్‌రెడ్డి, లొడంగి శ్రవణ్‌కుమార్, బి.వెంకటరమణ, పబ్బు వీరస్వామి, ఆర్.అంజాచారి, బంటు వెంకటేశ్వర్లు, నలపరాజు రామలింగయ్య, గురిజ రామచంద్రం, టి.వెంకటేశ్వర్లు, గిరి, రమ పాల్గొన్నారు.

యాదాద్రిలో విశేష పూజలు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో బుధవారం నిత్య పూజలు కొనసాగాయి. వేకువజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు స్వయంభూ, ప్రతిష్ఠా అలంకార మూర్తులకు సుప్రభాతం, అర్చన, అభిషేకం వంటి సంప్రదాయ పూజలు నిర్వహించారు. అనంతరం ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తులకు అష్టోత్తర పూజలు చేపట్టారు. ఇక ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం వంటి పూజలు జరిపించారు. ఆయా పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రికి శ్రీస్వామి వారికి శయనోత్సవం నిర్వహించి, ఆలయాన్ని ద్వార బంధనం చేశారు.

వైభవంగా నగరోత్సవం



కోలాటాలు, డప్పు వాయిద్యాల నడుమ సాగుతున్న నగరోత్సవం



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వీరేశం

రామగిరి(నల్లగొండ) : చెర్వుగట్టులో ఈనెల 14 నుంచి 21 వరకు శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నగరోత్సవ కార్యక్రమాన్ని నల్లగొండలో బుధవారం వైభవంగా నిర్వహించారు. 2019లో రద్దయిన నగరోత్సవం మంత్రి వెంకట్‌రెడ్డి చొరవతో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఆధ్వర్యంలో తిరిగి ఈసారి నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ప్రజలందరికీ బ్రహ్మోత్సవాల విశిష్టతను తెలియజేసేందుకే నగరోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే వీరేశం తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ రవి, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆఫ్‌లైన్ రవాణా!

- రీచ్‌ల నుంచి అక్రమంగా తరలుతున్న ఇసుక
- ప్రభుత్వ పనుల పేరిట అనుమతులు
- ఒక్క అనుమతి పత్రంతో పది ట్రాక్టర్ల వరకు రవాణా
- వినియోగదారులపై అధిక భారం
- కొత్త పాలసీ తేనున్న ప్రభుత్వం



తడకమళ్లలో ఇసుక డంప్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ (ఫైల్)

మిర్యాలగూడ : ఇసుక అక్రమ రవాణా జిల్లాలో జోరుగా సాగుతోంది. గత ప్రభుత్వం ఇసుకను ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసుకుంటే సరఫరా చేసే పద్ధతిని అమలు చేసింది. కానీ, ప్రభుత్వ పథకాల పనులకు ఆన్‌లైన్ లేకుండానే సరఫరా చేసే వారు. దీన్ని ఆసరాగా చేసుకున్న రవాణాదారులు ప్రభుత్వ పథకాల పేరిట ఇసుకను అక్రమంగా తరలిస్తూ అక్రమార్జనకు పాల్పడుతున్నారు. మంగళవారం మిర్యాలగూడ మండలంలోని తడకమళ్లలో మైనింగ్ అధికారులు ఇసుక డంప్‌ను స్వాధీనం చేసుకుని తహసీల్దార్‌కు అప్పగించారు. ఇసుక అక్రమంగా తరలడం వల్ల ప్రభుత్వ ఆదాయానికి పెద్ద ఎత్తున గండి పడుతోంది. అయితే, ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం కొత్త పాలసీ తీసుకురానుంది. దీనికి సంబంధించి ఇప్పటికే ఆయా శాఖల అధికారులకు అనధికారికంగా ఆదేశాలు వచ్చినట్లు తెలుస్తోంది. ఈ కొత్త పాలసీ ద్వారా అయినా ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడుతుందో లేదో చూడాలి.

గ్రామ శివారులో డంప్..

నిర్మాణదారులకు తమకు అవసరమైన ఇసుక కోసం ముందుగానే ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకోవాలి. బుకింగ్ ఆధారంగా సీరియల్ ప్రకారం బుకింగ్ చేసుకున్న 3, 4 రోజుల్లోపే ఇసుక సరఫరా కావాలి. పట్టణ ప్రాంతాల్లో వందలాది మంది వినియోగదారులు ఇసుక కోసం నెల రోజుల క్రితమే బుకింగ్ చేసుకున్నప్పటికీ ఇసుక సరఫరా కావడం లేదు. దీంతో నెలల తరబడి నిర్మాణాలు నిలిచిపోతున్నాయి. కానీ ఆఫ్‌లైన్‌లో మాత్రం కోరిన వెంటనే ఇసుక వస్తోంది. రవాణాదారులు రీచ్‌ల వద్ద నుంచి పెద్ద ఎత్తున ఇసుకను తరలించి గ్రామశివారు ప్రాంతాల్లో డంపింగ్ చేస్తున్నారు. ఇసుక కావాల్సిన వారికి రాత్రి వేళ, తెల్లవారుజామున గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తున్నారు. బుకింగ్ లేకుండా ఇసుక తరలించి ఆన్‌లైన్ రేటు కంటే అదనంగా రూ.2 వేల వరకు వసూలు చేస్తున్నారు. కాగా కొన్ని ప్రాంతాల్లో రెవెన్యూ, పోలీసు అధికారులే వారికి ఎస్కార్ట్‌గా వ్యవహరిస్తున్నారంటూ ఆరోపణలు రావడం కొసమెరుపు.

నిబంధనల ప్రకారం నడుచుకుంటాం



ఇసుక రవాణా విషయంలో కొత్త ప్రభుత్వం కొత్త పాలసీని తీసుకురాబోతుంది. ఉన్నతాధికారులు ఇచ్చిన నిబంధనల ప్రకారం నడుచుకుంటాం. ప్రస్తుతం ఇసుక రవాణాకు అనుమతి ఇచ్చే అధికారం మాకు లేదు. ప్రభుత్వ ఆదేశానుసారం నిబంధనలను కఠినంగా అమలు చేస్తాం.

- హరిబాబు, తహసీల్దార్, మిర్యాలగూడ

ప్రభుత్వ పనుల పేరిట అనుమతులతో..

ప్రధానంగా ప్రభుత్వ అభివృద్ధి పనులైన సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, కాంపౌండ్ వాల్స్, మన ఊరు– మన బడి పథకం పనుల కోసం తహసీల్దార్, పంచాయతీరాజ్ అధికారుల నుంచి ఇసుక అనుమతులు పొందుతున్నారు. ఒక్క అనుమతి పత్రం తీసుకుని రెండు, మూడు రోజుల పాటు యథేచ్ఛగా ఇసుక తరలిస్తున్నారు. ఇలా మిర్యాలగూడ సర్కిల్ పరిధిలోని ఆయా రీచ్‌ల నుంచి రోజూ సుమారు వందల ట్రాక్టర్లు ఇసుక రవాణా అవుతోంది. ఇందుకు గాను ఒక్కో ట్రాక్టర్‌కు పోలీసు అధికారులు నెలకు రూ.10వేల చొప్పున వసూలు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఆ వచ్చిన మామూళ్లను పైస్థాయి నుంచి కిందిస్థాయి అధికారుల వరకు పంచుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

క్లుప్తంగా

సెల్‌ఫోన్ అప్పగింత

భువనగిరి క్రైం : మండలంలోని బొల్లేపల్లి గ్రామానికి చెందిన సందెల అశోక్ తన భార్యతో కలిసి జనవరి 20న జిల్లా కేంద్రం నుంచి స్వగ్రామానికి బైక్‌పై బయలుదేరాడు. మార్గమధ్యలో అతడి సెల్‌ఫోన్ పడిపోయింది. బాధితుడు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు దర్యాప్తు చేశారు. మొబైల్ వివరాలు సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేసి ఈఎంఈఐ నంబర్ ఆధారంగా ఆచూకీ కనిపెట్టారు.బుధవారం ఎస్‌ఐ సంతోష్‌కుమార్ బాధితుడు అశోక్‌కు మొబైల్ అందజేశారు. బాధితులు ఫోన్ పోగొట్టుకుంటే పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఎస్‌ఐ తెలిపారు.

గడ్డిమందు తాగిన వ్యక్తి మృతి

మునగాల(కోదాడ): ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందాడు. మునగాల మండలం బరాఖత్‌గూడెం గ్రామానికి చెందిన మండవ నర్సయ్య (49)కుటుంబ కలహాల నేపథ్యంలో ఈ నెల 2వ తేదీన ఇంటి వద్ద గడ్డిమందు తాగాడు. కుటుంబ సభ్యులు అతడిని సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య భాగ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ బైరెడ్డి అంజిరెడ్డి తెలిపారు.

తొమ్మిది మందికి జరిమానా

మిర్యాలగూడ అర్బన్: మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న పలువురికి కోర్టు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఎస్‌ఐ మోహన్‌యాదవ్ బుదవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల మిర్యాలగూడ పట్టణంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో 9మంది పట్టుబడ్డారని, వారిని కోర్టులో హాజరుపర్చగా రూ.14.7వేల జరిమానా విధించినట్లు తెలిపారు.

40బస్తాల ధాన్యం చోరీ

గుర్రంపోడు : గుర్తుతెలియని వ్యక్తులు వ్యవసాయ బావి వద్ద షెడ్డులో ఉంచిన ధాన్యాన్ని చోరీ చేశారు. గుర్రంపోడు మండలం ఆమలూరు గ్రామంలో రైతు బొమ్ము నర్సింహ వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గత వానాకాలం సీజన్ ధాన్యం 40 బస్తాల ధాన్యాన్ని బావి వద్ద ఉన్న షెడ్డులో ఉంచాడు. మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఆ ధాన్యం బస్తాలతో పాటు 5లీటర్ల గడ్డిమందును అపహరించుకుపోయారు. నర్సింహ బుధవారం బావి వద్దకు వెళ్లగా చోరీ విషయం వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు నర్సింహ తెలిపాడు. కేసు విచారణ జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

ఈవీఎంల ఎఫ్‌ఎల్‌సీ పూర్తి

దురాజ్‌పల్లి (సూర్యాపేట): ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల (ఈవీఎంల) మొదటి లెవెల్ చెకింగ్ (ఎఫ్‌ఎల్‌సీ) ప్రక్రియ పూర్తి చేశామని జిల్లా అదనపు కలెక్టర్ సీహెచ్ ప్రియాంక తెలిపారు. సమీకృత కలెక్టరేట్ ఆవరణలో ఈవీఎం గోదాములో ఈ నెల 2నుంచి జరుగుతున్న ఈవీఎంల ఎఫ్‌ఎల్‌సీని చివరి రోజు బుధవారం ఆమె పరిశీలించి మాట్లాడారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రానున్న లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో బ్యాలెట్ యూనిట్లు 2,803, కంట్రోల్ యూనిట్లు 1,742, వీవీపాట్లు 1,848, మొదటి లెవెల్ చెకింగ్ పూర్తి చేశామన్నారు. గురువారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో మాక్ పోల్ నిర్వహించబడుతుందన్నారు. కార్యక్రమంలో ఎన్నికల సూపరింటెండెంట్ శ్రీనివాసరాజు, డీటీ వేణు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జాతరలు వచ్చే.. సందడి తెచ్చే

- మాఘ మాసంలో పీఏపల్లి మండలంలో ఆధ్యాత్మికశోభ
- ఇక్కడి ఆలయాల్లో పక్షం రోజుల పాటు సాగనున్న ఉత్సవాలు
- ఆటల పోటీలు, సాంస్కృతిక ప్రదర్శనలు

పెద్దఅడిశర్లపల్లి : మాఘ మాసం వచ్చిందంటే పెద్దఅడిశర్లపల్లి మండలంలోఆధ్యాత్మిక శోభ ఉట్టిపడుతుంది. పూజలే కాదు.. ఆటలు.. సాంస్కృతిక మేళవింపుతో సందడి నెలకొంటుంది. పీఏపల్లి మండలంలోని బాలాజీనగర్, కోదండాపురంలలో శ్రీ వేంకటేశ్వరస్వామి, మేడారంలో లక్ష్మీనరసింహస్వామి దేవాలయాల్లో ప్రతి ఏడాది ఈ మాసంలో పక్షం రోజుల పాటు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తుంటారు. వేడుకలకు స్థానికులే కాకుండా వేర్వేరు జిల్లాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివస్తుంటారు.

బాలాజీ ఉత్సవాల గాథ ఇది

పూర్వ కాలంలో ఏలేశ్వరం గ్రామంలో ఉండే ప్రజలే ఈ బాలాజీనగర్ వాసులని, గాంగ్య అనే ఓ గిరిజనుడు సంతానం కలగలేదు. దీంతో శ్రీ వేంకటేశ్వరస్వామిని భక్తిశ్రద్ధలు, నిష్టతో పూజలు చేసి ఆరాధించాడు. అయితే స్వయంగా శ్రీ వేంకటేశ్వర స్వామి ప్రత్యక్షమై నీకు ఆరుగురు కుమారుల సంతానం కలుగుతుందని, ఒక చోటికి తీసుకెళ్లి జెండా, ఇత్తడి బిందెను అందించాడు. నీకు సంతానం కలిగాక బాలాజీనగర్ దేవాలయంలో ప్రతి మాఘ మాసంలో జాతరను జరపాలని సూచించినట్లు పురాణ గాథ ఉంది. స్వామి వారు చెప్పినట్లు ఆ గిరిజన దంపతులకు ఆరుగురు సంతానం కలగడం, ఆ ఆరుగురు సంతానమే ఒక తండాగా ఏర్పడడంది. సుమారు 52 ఏళ్లపైగా ఈ జాతర జరుగుతుందని ఇక్కడి ప్రజలు పేర్కొంటున్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఇక్కడి వాసులు 41 రోజుల పాటు దీక్ష చేపడుతారు.



పీఏపల్లి మండలం బాలాజీనగర్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం

ఆటలు.. సాంస్కృతిక ప్రదర్శనలు

పీఏపల్లి మండలంలో జరిగే జాతరలో ప్రత్యేక ఆకర్షణగా ఆటల పోటీలు, సాంస్కృతిక ప్రదర్శనలు నిలుస్తున్నాయి. కోలాట బృందం చేసే హడావుడి అంతా ఇంత కాదు.. మహిళలు, చిన్నారులు ఆటపాటలతో కోలాటం ఆడుతుంటారు.. ఇక దేవాలయాలు విద్యుత్ ప్రభల వెలుగులతో జిగేలుమనిపిస్తుంటారు.. మొత్తంగా ఆధ్యాత్మిక శోభతో మండలం ఒలలాడుతోంది. దీంతో పాటు జాతరను పురస్కరించుకొని రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో కబడ్డీ, క్రికెట్ పోటీలతో యువత ఉత్సాహంగా పాల్గొంటుంది.

బ్రహ్మోత్సవాల ముఖ్య ఘట్టాలు

బాలాజీనగర్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి 52వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం సీతారామచంద్రస్వామి పూజ, శుక్రవారం గణపతిపూజ,పుణ్యావాచనం, రుద్రాభిషేకం,హనుమదాభిషేకం, శనివారం సీతారాముల కల్యాణోత్సవం, అగ్నిగుండం, జాతర, ప్రభ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. అలాగే మేడారం ఏకాదశ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం తెల్లవారుజామున ఉదయం 4 గంటలకు స్వామి వారి కల్యాణోత్సవం, శనివారం తెల్లవారుజామున ఉదయం 4 గంటలకు రథోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి రోజు ఫిబ్రవరి 15,16 వ తేదీల్లో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారు. కోదాడాపురంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 29 న వేంకటేశ్వరస్వామి పూజలతో మొదలుకొని మార్చి 2 తెల్లవారితే 3న స్వామి వారి కల్యాణోత్సవంతో, మార్చి4న రాత్రి తెల్లవారితో 5న రథోత్సవం,6న పూర్ణాహుతి,ఏకాంతసేవ,దోపోత్సవంతో ముగియనున్నాయి.

మేడారంలో వెలిసిన లక్ష్మీనరసింహ స్వామి

పీఏపల్లి మండలంలోని మేడారం గ్రామంలో 11 సంవత్సరాల క్రితం నిర్మించిన మేడారం దేవాలయం నిర్మించారు. మాఘమాసం పురస్కరించుకొని ఇక్కడ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తుంటారు.



మేడారంలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయం

రెండో తిరుపతిగా..

పీఏపల్లి మండలం కోదండాపురం గ్రామంలో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి 408 సంవత్సరాల చరిత్ర ఉంది. తేరా లక్ష్మమ్మ అనే మహిళ తిరుపతికి వెళ్లిందని.. ఆమె భక్తికి మెచ్చిన శ్రీ వేంకటేశ్వర స్వామి ఆమెతో కలిసి మూడు అడుగులు వేసి పీఏపల్లి మండలంలోని కోదండాపురంలోని గుట్టపై మూడో అడుగు వేశారని, జమ్మిడి చెట్టుపై ప్రత్యక్షమైనట్లు, రాబోయే రోజుల్లో ఇది దిగువ తిరుపతిగా విరాజిల్లుతుందని స్వామి వారు చెప్పినట్లు ఓ గాథ ప్రచారంలో ఉంది. ప్రతి ఏడాది మాఘమాసంలో వారం రోజుల పాటు కోదండాపురంలో శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు జరుగుతుంటాయి. ఇక్కడికి స్థానికులే కాకుండా వేర్వేరు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు జరపడంతో పాటు కానుకలు సమర్పిస్తుంటారు.



కోదండాపురంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం

కమనీయం శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణం

పీఏపల్లి మండలంలోని బాలాజీనగర్, మేడారం, కోదండాపురంలలో జరిగే జాతర సందర్భంగా శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణం అత్యంత ముఖ్యమైంది. స్వామి వారి కల్యాణ ఘట్టాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో ఈ ప్రాంతాలకు తరలివస్తుంటారు. కళ్యాణంతో పాటు రథోత్సవ వేడుకలు జాతరకే వన్నె తెస్తుంటాయి. ఉదయం మొదలుకొని రాత్రి వరకు జరిగే ఈ కల్యాణ, రథోత్సవ కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తలంబ్రాండ్లు సమర్పిస్తుంటారు.

26 డొమెస్టిక్ సిలిండర్ల పట్టివేత

చిట్యాల: పట్టణంలోని పలు హోటల్స్, టిఫిన్ సెంటర్లతో పాటు ఇతర వ్యాపార దుకాణాల్లో అనుమతులు లేకుండా వినియోగిస్తున్న 26 డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను బుధవారం సివిల్ సప్లయ్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. పలువురి ఫిర్యాదు మేరకు టిఫిన్ సెంటర్స్, హోటల్స్‌లో అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. పట్టుకున్న సిలిండర్లను గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులకు అప్పగించారు. ఈ తనిఖీల్లో సివిల్ సప్లయ్ ఆర్‌ఐ లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడలో 26 సిలిండర్లు..

మిర్యాలగూడ: గృహ అవసరాల కోసం వినియోగించే వంట గ్యాస్ సిలెండర్లను దామరచర్ల కేంద్రంలో పలు హోటళ్లలో ఉపయోగిస్తుండడంతో విజిలెన్స్ అధికారులు బుధవారం దాడులు చేసి పట్టుకున్నారు. ఈ సందర్భంగా సివిల్ సప్లయ్ డీటీలు జావెద్, ముక్తర్‌లు మాట్లాడుతూ గృహ అవసరాల కోసం ఉపయోగించే వంట గ్యాస్ సిలెండర్లను దామరచర్ల మండల కేంద్రంలోని పలు హోటళ్లు, దుకాణాదారులు ఉపయోగిస్తూ రీఫిల్లింగ్ చేస్తున్నారన్న సమాచారం అందడంతో ఎనిమిది హోటళ్లు, రెండు కిరాణ దుకాణాల్లో దాడులు చేసి 26 సిలిండర్లను పట్టుకుని స్థానిక గ్యాస్ ఏజెన్సీకి అప్పగించినట్లు తెలిపారు. ఈ మేరకు హోటళ్లు, దుకాణదారులపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.



పట్టుకున్న సిలిండర్లతో అధికారులు

విద్యుదాఘాతంతో మహిళ మృతి

పెద్దఅడిశర్లపల్లి : విద్యుదాఘాతంతో మహిళ మృతిచెందింది. పెద్దఅడిశర్లపల్లి మండలం మేడారం గ్రామానికి చెందిన గొంగడాల జానమ్మ (33) తన ఇంట్లో టీవీ స్విచ్ ఆన్ చేస్తుండగా చేతికి వైరు తగలడంతో విద్యుదాఘాతానికి గురైంది. కుటుంబ సభ్యులు గమనించేలోపే ఆమె విగతజీవురాలిగా కనిపించింది. సమాచారం మేరకు పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి భర్త గొంగడాల శ్రీనయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గుడిపల్లి ఎస్‌ఐ నర్సింహులు తెలిపారు.



జానమ్మ మృతదేహం

సమీకృత వ్యవసాయంతో లాభాలు

నడిగూడెం : సమీకృత వ్యయసాయంతో అధిక లాభాలు పొందవచ్చని పాలేరు మత్స్య పరిశోధనా స్థానం శాస్త్రవేత్త బి.రవీందర్ తెలిపారు. బుధవారం నడిగూడెం మండల పరిధిలోని సిరిపురం గ్రామానికి చెందిన ఆదర్శ రైతు వాసికర్ల శేషుకుమార్ సమీకృత వ్యవసాయంలో భాగంగా ఆయన చేపట్టిన చేపల చెరువును పరిశీలించిన రైతులతో మాట్లాడారు. సమీకృత వ్యవసాయంలో భాగంగా చేపల పెంపకంతో అదనపు లాభాలు పొందవచ్చని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఆయన వెంట వాసికర్ల శేషుకుమార్, మొక్క లక్ష్మయ్య, తదితరులున్నారు.



చెరువును పరిశీలిస్తున్న శాస్త్రవేత్త రవీందర్

కంపచెట్లలో పసికందు లభ్యం

మఠంపల్లి: గుర్తుతెలియని వ్యక్తులు కండ్లు కూడా తెరవని ఆడశిశువును కంపచెట్లలో వదిలేశారు. ఈ హృదయ విదారక ఘటన సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలో బుధవారం వెలుగులోకి వచ్చింది. సుమారు వారం రోజుల క్రితం జన్మించిన ఆడపిల్లను మండలంలోని పెదవీడు రెవెన్యూ పరిధి సుల్తాన్‌పూర్‌తండా పునరావాస కేంద్రంలో గల కంపచెట్లలో వదిలివేశారు. కేకలు విన్న స్థానికులు కంపచెట్లలో పరిశీలించగా తీవ్ర గాయాలతో పసికందు కనిపించింది. స్థానిక అంగన్‌వాడీ సిబ్బంది అక్కున చేర్చుకున్నారు. అనంతరం ఐసీడీఎస్ ఉన్నతాధికారులు, పోలీసులు శిశువును హుజూర్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం అక్కడినుంచి సూర్యాపేట జిల్లా ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. పసికందు విషయంపై రాత్రి వరకు ఐసీడీఎస్ అధికారులు గోప్యత పాటించడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.



కంపచెట్లలో దొరికిన పసికందు

ప్రజల మన్ననలు పొందాలి : సూర్యాపేట ఎస్పీ

సూర్యాపేట క్రైం: పోలీస్ అధికారులు, సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వహిస్తూ ప్రజలు మన్ననలు పొందాలని సూర్యాపేట ఎస్పీ రాహుల్ హెగ్డే అన్నారు. జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో పనిచేస్తున్న హెడ్‌కానిస్టేబుల్స్ రాములు, వెంకట్‌రెడ్డి, నర్సయ్య, దానియేల్, సాలయ్య, భగవాన్, రవీందర్‌రెడ్డి, శ్రీనివాసాచారి, శ్రీనివాస్‌రెడ్డి ఏఎస్‌ఐలుగా ఉద్యోగోన్నతి పొందిన సందర్భంగా బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ రాహుల్ హెగ్డేని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి ఎస్పీ ప్రమోషన్ పత్రాలను అందించి మిఠాయిలు పంచి శుభాకాంక్షలు తెలిపారు.

హోంగార్డు కుటుంబానికి మంత్రి ఆర్థికసాయం

నల్లగొండ : బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం నల్లగొండలో నిర్వహించిన బహిరంగ బందోబస్తు విధులు నిర్వహిస్తూ రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన నార్కట్‌పల్లి పోలీస్‌స్టేషన్ హోంగార్డు నవ కిశోర్ మృతదేహాన్ని స్థానిక కాంగ్రెస్ నాయకులు బుధవారం నల్లగొండ మండలం అన్నెపర్తిలో సందర్శించారు. ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం మృతుడి కుటుంబానికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పంపించిన రూ.2లక్షల ఆర్థికసాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో నల్లగొండ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే సతీమణి వేముల పుష్ప, జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, కౌన్సిలర్ అంగోతు ప్రదీప్ నాయక్ తదితరులు ఉన్నారు.



మృతుడి కుటుంబ సభ్యులకు రూ.2లక్షల నగదు అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి, మోహన్‌రెడ్డి

చేపల కోసం చెరువులో నీరు ఖాళీ చేసే యత్నం

- అడ్డుకున్న వట్టిఖమ్మంపహాడ్ గ్రామస్తులు

చివ్వెంల(సూర్యాపేట) : చేపలు పట్టుకునేందుకు వ్యాపారులు చెరువునీరు ఖాళీ చేసేందుకు యత్నించగా గ్రామస్తులు అడ్డుకున్నారు. చివ్వెంల మండలం వట్టిఖమ్మంపహాడ్‌లో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కొందరు వ్యాపారులు గ్రామ శివారులోని పెద్ద చెరువును వేలంలో కైవసం చేసుకున్నారు. చెరువులో పెంచిన చేపలు పట్టుకునేందుకు రెండు రోజులుగా సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద వైర్లకు కొండ్లు తగిలించి, 5హెచ్‌పీ మోటార్‌తో నీటిని తొలగిస్తున్నారు. గమనించిన సమీప రైతులు విషయాన్ని గ్రామస్తులకు తెలుపడంతో సంఘటన స్థలానికి చేరుకున్న నీటి తోడకాన్ని అడ్డుకున్నారు. అనంతరం గ్రామ ప్రత్యేరాధికారి పి.సంతోష్ కుమార్, విద్యుత్ ఏఈ మల్లయ్య, రెవెన్యూ , ఇరిగేషన్ అధికారులకు సమాచారం అందించారు. దీంతో విద్యుత్ అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని అక్రమంగా తగిలించిన కొండ్లను తొలగించి, విద్యుత్‌వైరును సీజ్ చేశారు. నీటి తొలగింపునకు పాల్పడిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు గ్రామ ప్రత్యేకాధికారి సంతోష్ తెలిపారు.



చెరువులో మోటార్‌ను తొలగిస్తున్న గ్రామస్తులు

వేర్వేరు చోట్ల ఇద్దరి బలవన్మరణం

రామగిరి(నల్లగొండ): వేర్వేరు చోట్ల ఇద్దరు వ్యక్తులు బలవన్మరణానికి పాల్పడ్డారు. తిప్పర్తి మండలం, సూర్యాపేట పట్టణంలో చోటు చేసుకున్న ఈ ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. తిప్పర్తి మండలం జొన్నగడ్డలగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని బండ్లవారిగూడెం గ్రామానికి చెందిన పిల్లి నాగరాజు(34) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల ఇంటి నిర్మాణానికి రూ.4లక్షలు అప్పు చేశాడు. ఇటు వ్యవసాయం కలిసి రాక, అటు ఆర్థిక ఇబ్బంది అధికం కావడంతో తట్టుకోలేక ఇంట్లోని స్నానాల గదిలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం నిద్రలేచి బాత్‌రూమ్ వద్దకు వెళ్లి చూసేసరికి విగతజీవుడిగా కనిపించాడని భార్య లక్ష్మమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. నాగరాజుకు ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ డి.రాజు తెలిపారు.

మద్యానికి బానిసై..

సూర్యాపేట క్రైం : పట్టణంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన సూరారపు జాన్(45) భార్య 2017లో మృతిచెందింది. అప్పటి నుంచి మద్యానికి జాన్ మద్యానికి బానిసగా మారాడు. జీవితంపై విరక్తితో జాన్ ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుమారుడు సాయితేజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



మృతుడు జాన్

హైదరాబాద్‌లో నకిరేకల్ వాసి మృతి

నకిరేకల్ : హైదరాబాద్‌లోని ఎల్.బి.నగర్‌లో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నకిరేకల్ వాసి మృతిచెందాడు. పట్టణంలోని కాటమయ్య బజార్‌కు చెందిన సాదిఖ్ అలీ(43) ప్రస్తుతం చార్మినార్ ఎక్సైజ్ సీఐగా పనిచేస్తున్నాడు. ఈయన ఓయూలో పీజీ పూర్తి చేశారు. ఏడేళ్ల క్రితమే ఎక్సైజ్ ఎస్‌ఐ ఉద్యోగం సాధించారు. పదోన్నతి రావడంతో చార్మినార్ ఎక్సైజ్ సీఐగా విధులు నిర్వహిస్తూ అక్కడే ఉంటున్నారు. మంగళవారం అర్ధరాత్రి మలక్‌పేట్ రోడ్డులో తన బుల్లెట్ వాహనంపై మరో ఎస్‌ఐతో కలిసి వెళ్తూ యూటర్న్ తీసుకుంటున్న క్రమంలో కారు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతదేహాన్ని బుధవారం ఆయన స్వగ్రామం నకిరేకల్‌కు తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. మతదేహాన్ని టీపీసీసీ నేత దైద రవీందర్ పూల మాలమాలలు వేసి నివాళులర్పించారు. ఎక్సైజ్ సీఐ సాదిఖ్ అలీ మృతితో నకిరేకల్ పట్టణంలో విషాదం అలుముకుంది.



సాదిఖ్ అలీ (ఫైల్)



నివాళులర్పిస్తున్న దైద రవీందర్

వృద్ధురాలు అదృశ్యం

చౌటుప్పల్ : మండల పరిధిలోని మసీదుగూడెం గ్రామపంచాయతీ మదిర శేరీల గ్రామంలో మంగళవారం వృద్ధురాలు అదృశ్యమైంది. గ్రామానికి చీరిక రాములమ్మ(75) మంగళవారం మధ్యాహ్నం సమయంలో ఇంటివద్ద నుంచి చేతి కర్ర సాయంతో నడుచుకుంటూ వెళ్లింది. రోజువారి మాదిరిగా గ్రామంలోనే ఉంటుందని భావించినప్పటికీ సాయంత్రం వరకు కూడా రాలేదు. దాంతో ఆచూకీ కోసం పరిసరాల్లో గాలించారు. బంధువులను వాకబుచేశారు. అయినా ఆచూకీ లభించలేదు. దాంతో కుటుంబసభ్యులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు.

మహిళ అదృశ్యం

భువనగిరి క్రైం : మహిళ అదృశ్యమైంది. భువనగిరి మండలం బస్వాపురం గ్రామానికి చెందిన ఉడుత చంద్రకళ (30) సిద్దిపేట జిల్లా మాందాపురం గ్రామానికి చెందిన సోదరి ఇంటికి వెళ్తున్నాని మంగళవారం సాయంత్రం తన కుమారుడితో కలిసి వెళ్లి కనిపించకుండా పోయింది. కుటుంబ సభ్యులు సోదరిని ఆరా తీయగా రాలేదని తెలిసింది. బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. చంద్రకళ తల్లి ఉడుత మణెమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



కుమారుడితో చంద్రకళ (ఫైల్)

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

నకిరేకల్ : ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందాడు. నకిరేకల్ మండలం పదిరెగూడేనికి చెందిన కదిరే సంజీవరెడ్డి(45) మద్యానికి బానిసై ఈనెల 10న ఇంటి వద్ద పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు అతడిని నల్లగొండ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సుధీర్‌కుమార్ తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Services

■ రుణాలు,వ్యక్తిగత,వ్యవసాయం,వ్యాపార రుణం,తక్కువవడ్డీ రేటు,సిబిల్అవసరంలేదు, NPAకూడా దరఖాస్తు చేసుకోవచ్చు.ఏజెంట్స్ కావలెను. అర్బన్ ఫైనాన్స్, పార్టీబా, 7627832084. [T-229]

పాస్‌పోర్ట్ పోయినది

■ వనపర్తి చంద్రశేఖర్ S/o అంజయ్య R/o రామలింగాలగూడెం, తిప్పర్తి మం॥, నల్లగొండ జిల్లా. నా యొక్క పాస్‌పోర్ట్ (No. J1217007) నేను తిప్పర్తి నుండి నకిరేకల్ రోడ్‌లో బైక్ పై వెళ్తుండగా పోయినది. దొరికినవారు సంప్ర॥ 9618555109 [Y-1124461]

వధువు కావలెను

■ కోమట్ల అమ్మాయి కావలెను. 1వ కోమట్ల అబ్బాయి 35 M.Sc., M.Ed., D.Ed. ప్రైవేట్ లెక్చరర్ 23 వేలు, ఆస్తి 36 లక్షలు నల్లగొండ. సంప్ర॥ సెల్ : 9121325068 [Y-798310]

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో ఇతర సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్) ✆ 945 945 3338 [G-824421]

Wanted

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్. మీ పేరు, అడ్రస్ కాల్/వాట్సప్ చేయగలరు. 91777 36926. [M-1233785]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి+ భోజనం. జీ: 18K. Ph: 9640258899, 9640468899 [H-793691]

■ మన పట్టణాలలో కొత్తగా స్థాపించిన బ్రాంచ్ నందు పనిచేయుటకు ఇంటర్, డిగ్రీ చదివిన యువతి/యువకులు కావలెను. వర్క్ ఫ్రం హోం కలదు. సంప్ర॥ 7013376444 [G-824413]

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ మేసేజ్‌లు పంపుతూ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్. మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 95027 12418, 90306 12463 [M-1233787]

■ ప్రముఖ హోంకేర్ సర్వీసెస్ హైదరాబాద్ లో వృద్ధులకు,పేషెంట్లకు సేవ చేయుటకు, బేబీకేర్, ఇంటి/వంట పనికి స్త్రీ/పు కా॥. జీ: 16,000-25000/-రూం+భో॥ఫ్రీ. ఫోన్: 9390843765 [H-788145]

■ నల్లగొండ పట్టణం SPT మార్కెట్ నందు గల ప్రముఖ మెన్స్‌వేర్ బట్టల షాపు నందు పనిచేయుటకు సేల్స్ గర్ల్స్/బాయ్స్ కావలెను. ఫుల్‌టైం/పార్ట్‌టైం సంప్ర॥ 8374907807 [Y-798423]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిం దిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మల్చింగ్ సాగు.. లాభాలు బాగు

- చీడపీడలు, కలుపు నివారణకు చెక్
- తక్కువ నీటివనరులతో అధిక దిగుబడులు



మల్చింగ్ పద్ధతిలో సాగు చేసిన టమాట పంట



మల్చింగ్ పద్ధతిలో సాగు చేసిన బీర పైరు



మల్చింగ్ గురించి రైతుకు వివరిస్తున్న మధు

పాడి పంట

నడిగూడెం : రానున్న వేసవిలో అందుబాటులో ఉన్న నీటిని సమర్థవంతంగా ఉపయోగించి పంటలను సాగు చేసేందుకు మల్చింగ్ విధానం తోడ్పడుతుంది. ప్రస్తుత పరిస్థితుల్లో భూగర్భ జలాలు అడుగంటిపోవడం వల్ల ఉద్యానవన పంటలకు సరిపడేంత నీటిని అందించడం రైతులకు తలకు మించిన భారంగా మారనుంది. ఈ సమయంలో దీని నుంచి బయట పడేందుకు రైతులు ప్రత్యామ్నాయ పద్ధతులు పాటిస్తే అందుబాటులో ఉన్న నీటి వనరులను ఉపయోగించుకొని పంటలను సమర్థంగా సాగు చేసుకోవచ్చని హార్టికల్చర్ కన్సల్టెంట్ కుడుముల మధు చెబుతున్న సలహాలు, సూచనలు..



కుడుముల మధు, హార్టికల్చర్ కన్సల్టెంట్

మల్చింగ్ అంటే..

సారవంతమైన మట్టిని పట్టి ఉంచడంతో పాటు నేలలోని తేమను ఎక్కువ కాలం ఉంచేలా మొక్క చుట్టూ పలు రకాలైన పదార్థాలను పరచి ఉంచడాన్నే మల్చింగ్ అంటారు. ఈ పద్ధతిలో తేమ ఆవిరికాకుండా మొక్క చుట్టూ ఎక్కువ కాలం ఉంటుంది. మల్చింగ్‌లో ప్లాస్టిక్ పట్టాలతో పాటు కాగితపు ముక్కలు సేంద్రియ పదార్థాలు, వరిగడ్డి, వ్యవసాయ వ్యర్థాలు తదితర వాటిని ఉపయోగిస్తారు.

మల్చింగ్ విధానంతో లాభాలు

మల్చింగ్ చేయడం వలన నేలలోని తేమ ఆవిరి కాకుండా ఎక్కువ రోజులు మొక్క మొదలు భాగంలో తేమగా ఉంటుంది. తేమను పరిరక్షించడమే కాకుండా ఉష్ణోగ్రత వ్యత్యాసాల వలన నేల భౌతిక స్థితి దెబ్బతినకుండా ఉంటుంది. నేలలోని సారవంతాన్ని కాపాడటంలో ఈ మల్చింగ్ ప్రధాన పాత్ర వహిస్తుంది. పంటలు సాగు చేయని కాలంలో సారవంతమైన మట్టిని కప్పి ఉంచుతుంది. మొక్కల మధ్య మల్చింగ్ పదార్థాలు ఉండడంతో కలుపును బాగా నియంత్రించడంతో పోషకాలన్నీ మొక్కలు తీసుకునేందుకు వీలుంటుంది. నత్రజని స్థిరీకరణ జరిగి నేలలో పోషకాల స్థాయి కూడా సహజసిద్ధంగా పెరుగుతుంది. ఈ మల్చింగ్ విధానాన్ని దీర్ఘకాలంగా చేస్తే పంటల్లో గణనీయమైన పెరుగుదలతో పాటు చీడ, పీడలను తట్టుకొనే శక్తి పెరుగుతుంది. అంతే కాకుండా పంటల ఉత్పాదనలో కూడా మెరుగుదల కన్పిస్తుంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

మల్చింగ్ చేసేటప్పుడు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలి. భౌగోళిక పరిస్థితులను, నేల స్వభావాన్ని బట్టి మల్చింగ్ అనేది చేసుకోవాలి. మల్చింగ్‌తో పాటు సూక్ష్మనీటి పద్ధతులను అవలంబిస్తే నీటి వనరులను కూడా వృథా కాకుండా సమర్థంగా ఉపయోగించుకోవచ్చు. సాగు చేసే పంటలను బట్టి మల్చింగ్‌ను ఏర్పాటు చేసుకోవాలి. ఎక్కువ విస్తీర్ణంలో మల్చింగ్‌ను చేయదలిస్తే అందుబాటులో ఉండే వనరులను మల్చింగ్ పదార్థాలుగా ఉపయోగించడం మేలు.